ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



న్యూస్ బాక్స్


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఎలిగేడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎలిగేడుకు చెందిన శివరాత్రి సంజన అనే 7వ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండల కేంద్రంలో ఈనెల 3న జరిగిన 68వ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14 కబడ్డీ బాలికల విభాగంలో సంజన ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంద్ర దేవేందర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్ రావు, ఫిజికల్ డైరెక్టర్ కన్న ప్రణయ్‌కుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ గ్రామస్థులు అభినందించారు.

గుండారంలో మూడు బోర్‌వెల్స్

కమాన్‌పూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ. 3.50 లక్షల నిధులతో మూడు బోర్‌వెల్స్ వేసే ప్రక్రియకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గుండారం గ్రామంలోని రైతు వేదిక వద్ద బోర్‌వెల్‌తో పాటు విద్యుత్తు మోటార్ ఏర్పాటు కోసం రూ. 1.50 లక్షలు, రాజాపూర్ పోచమ్మ ఆలయం వద్ద హ్యాండిల్ బోర్ వెల్‌కు రూ. లక్ష, గుండారం రిజర్వాయర్ షెటర్ల వద్ద హ్యాండిల్ బోర్‌వెల్ కు రూ. లక్ష చొప్పున గతంలోనే నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచకొండ లక్ష్మీ రవి, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సాగి శ్రీదర్‌రావు, ఆకుల రాజయ్య, ఆవునూరి కిరణ్, ఆవునూరి రాజలింగు, పిడుగు పోచాలు, ముకుంద, శ్రావన్, గోస్కుల స్వామి తదితరులు ఉన్నారు.

- పట్టభద్రుల ఓటు నమోదుకు 6వ తేదీ చివరి గడువు
- పెద్దగా ఆసక్తి చూపని పట్టభద్రులు
- అవగాహన కల్పించని యంత్రాంగం
- పెరగనున్న ఉపాధ్యాయ ఓటర్లు
- ఆశావహుల విస్తృత ప్రచారం



గడువు మూడు రోజులే..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వచ్చే ఏడాది మార్చి చివరలో జరగనున్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు కోసం ఇంకా మూడు రోజులే మిగిలి ఉంది. ఈనెల ఆరో తేదీన గడువు ముగియనున్నది. ఓటరు నమోదు చేసుకునేందుకు పటభద్రులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో పట్టభద్రులుగా నమోదు చేసుకున్న ఓటర్లు సైతం మళ్లీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని చెప్పడంతో కొంత మంది ఓటర్లు సర్టిఫికెట్లు లభ్యంకాక నమోదు చేసుకోలేక పోతున్నారు. అలాగే వివిధ ఉద్యోగాల్లో కొలువుదీరిన ఉద్యోగులు, వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, నిరుద్యోగులు నేరుగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఉన్న టి జీవన్ రెడ్డి, రఘోత్తంరెడ్డిల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఆలోపు ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్నది. అందులో భాగంగా కొత్త ఓటర్ల నమోదుకు సెప్టెంబర్ 30వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. గడిచిన ఎన్నికల నాటికి పట్టభద్రుల ఓటర్లు 1,96,321 మంది ఉండగా, ఉపాధ్యాయ ఓటర్లు 21,000 మంది వరకు ఉన్నారు. 2022 నవంబరు నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా గానీ, సంబంధిత కార్యాలయాల్లో గానీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గతంలో కేవలం ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కు ఉండేది. అందులో ఎస్టీటీలకు ఓటు హక్కు లేదు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు గాను ప్రభుత్వ విద్యాలయాల్లోనే కాకుండా ప్రైవేట్ విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కూడా అవకాశం కల్పించారు. మూడేళ్ల నుంచి పనిచేస్తున్న వారై ఉండాలని పేర్కొన్నారు. దీంతో గతంలో కంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కానీ పట్టభద్రుల ఓటర్ల సంఖ్య గతంలో కంటే కొంత మాత్రమే పెరగనున్నది. వాస్తవానికి పట్టభద్రుల శాసనమండలి పరిధిలో సుమారు 10 లక్షలకు పైగా డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్, డాక్టర్, తదితర డిగ్రీ సంబంధ కోర్సులు చదివి ఉన్నారు. ఓటు హక్కు పొందడానికి మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఓటు హక్కు నమోదు ప్రక్రియపై జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. నమోదు గురించి ప్రసార మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం నిర్వహించడం లేదు. దీంతో ఓటర్ల నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది.

● ఓటర్ల సంఖ్య పెంచేందుకు...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నెల రోజుల నుంచే హడావుడి మొదలైంది. నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల కంటే కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి పోటీచేసే ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పులి ప్రసన్న హరికృష్ణ, డాక్టర్ హరికృష్ణ రెడ్డి, ముస్తాక్ అహ్మద్ తాము పోటీలో ఉంటున్నామని ఇప్పటికే

మిగతా 8వ పేజీలో....

క్రీడలపై దృష్టి సారించి జిల్లాకు పతకాలు సాధించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

- ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఖోఖో పోటీలు



మంథని బాలుర జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో క్రీడా పోటీలు ఆదివారం సుల్తానాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలబాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. సుల్తానాబాద్ పట్టణం క్రీడలకు పుట్టినిల్లు అని, ఖేలో ఇండియా కోచ్ గెల్లు మధుకర్ ఖోఖో క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని సుల్తానాబాద్‌కు మంచిపేరు తీసుకువచ్చాడన్నారు. విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించి జిల్లాకు పలు పతకాలు సాధించాలని సూచించారు. రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. 17 సంవత్సరాల బాలుర విభాగంలో మంథని మొదటి బహుమతి సాధించగా, సుల్తానాబాద్ జట్టు రెండో బహుమతి సాధించింది. బాలికల విభాగంలో సుల్తానాబాద్ మొదటి బహుమతి సాధించగా పెద్దపల్లి జట్టు రెండో బహుమతి సాధించారు. పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి పెటా అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి దాసరి రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ శౌరెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధుకర్, జోన్ కార్యదర్శులు మాధురి, ఫిజికల్ డైరెక్టర్లు , క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రినిటీ డిగ్రీ విద్యార్థుల సందడి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ట్రినిటీ డిగ్రీ పీజీ కాలేజీ విద్యార్థులు ఆదివారం బిగినర్స్ బాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రినిటీ గ్రూప్ అఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల కలలుసాకారం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉన్నతంగా లక్ష్యాన్ని పెట్టుకొని విద్యను కొనసాగించాలని దాసరి మమతా రెడ్డి అన్నారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కొత్త విద్యార్థులకు స్వాగతం పలుకుతూ చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో జోష్ నింపారు. మొబైల్ వాడకంపై చేసిన స్కిట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, అధ్యాపకులు అజయ్ కుమార్, రామ్ చందర్, సంజీవ రెడి , సరిత, అశ్విని పాల్గొన్నారు.



గుంతల మయంగా తయారైన శాలపల్లి రోడ్డు

ఎన్టీపీసీ పట్టించుకోదు.. మున్సిపాలిటీకి పట్టింపు లేదు..

- అధ్వానంగా శాలపల్లి, మల్యాపూర్ రహదారులు

8



నర్సాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

ముగిసిన సమగ్ర కుటుంబ సర్వే ఇళ్ల పరిశీలన

ఇంటింటికి స్టిక్కర్లు అంటించిన ఎన్యూమరేటర్లు

8

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లో వోల్టేజీ సమస్య తీర్చేందుకు కొత్త లైన్ వేస్తున్నందున ధర్మారంలోని గణేష్‌నగర్‌లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎండీ ఖానీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అంతరాయం ఉంటుదని, వినియోగ దారుల సహకరించాలని ఆయన కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ముత్తారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బక్కతట్ల కుమార్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సింగనవేణ సదయ్య యాదవ్, గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు పెగడ కుమార్ యాదవ్, బక్కతట్ల వినీత్, చుంచు లింగయ్య, సింగనవేన సమ్మయ్య, తాత రాజ య్య, పోసాని కొమురయ్య, జనార్దన్ యాదవ్, పాశం రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో ప్రతీ గింజను కొంటాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరామణారావు

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రతీ గింజను మద్దతు ధర చెల్లించి కొంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఆదివారం సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి, సుగ్లంపల్లి గ్రామాల్లో సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి వడ్ల కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయించే బాధ్యత తనదన్నారు. ప్రతీ గింజకు మద్దతు ధర చెల్లించి వడ్లను కొనుగోలు చేస్తామని చెప్పారు. సన్నవడ్లు వేసుకోమని చెప్పి రైతులను దివాలా తీయించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. అలాగే, సన్న వడ్లకు క్వింటాలుకు ఐదు వందల రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తామన్నారు. రైతులకు ఎక్కడ మోసం జరిగినా సహించేది చేసేది లేదని స్పష్టం చేశారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు వడ్ల కటింగ్‌ల పేరిట రైతులను నిలువునా ముంచారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపల ప్రకాష్ రావు, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మీ-రాజమల్లు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, సాయిరి మహేందర్, రాములు చిలుక సతీష్, వేగోలం అబ్బయ్య గౌడ్, ముస్త్యాల రవి, సంతోష రావు , రాజలింగం, బిరుదు కృష్ణ, పసెడ్ల మమత, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన ప్రతీ రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు 500 బోనస్ అందిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం మండలంలోని వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, ఇదిలాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మిన వెంటనే రైతుకు ట్రాక్ సీట్ ఇవ్వాలని ధాన్యం కొనుగోలు నిర్వాహకులకు తెలిపారు. ధాన్యం కాంటాలు కూడా రెండురోజుల్లో ప్రారంభిస్తామన్నారు. 17శాతం తేమ వచ్చే వరకు రైతు ఆరబోయాలన్నారు. వర్షాలతో తడిసి మొలకెత్తిన ధాన్యం బస్తాలు ఉంటే వాటిని ప్రత్యేకంగా ఉంచాలని, ధాన్యాన్ని ఇదే దరకు గింజ కటింగ్ లేకుండా అమ్మిస్తానని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజాన వేన సదయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు జట్టి దేవేందర్, కారుకూరి సత్యనారాయణ, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ సజ్జు, నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి పూర్తిగా మద్దతు ధర చెల్లిస్తూ సన్నవడ్లకు బోనస్ అందిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఆదివారం మండలంలోని నర్సాపూర్, నా రా య ం ణ ప ల్లి , ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగో లు కేంద్రాలను స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కటింగ్ పేరుతో మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోప విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కొత్తిరెడ్డి అశోక్‌రెడ్డి, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, కలువల విజయచందర్, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బాలసాని పర్శరాంగౌడ్, బూర్ల వెంకటసత్యం, నరహరి సుధాకర్‌రెడ్డి, పొల్సాని పుల్లారావు, తుమ్మల సుధాకర్‌రెడ్డి, పొట్యాల రమేష్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి కేశెట్టి విక్రమ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

● మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి సోఫియాన్‌థౌసిఫ్ ఎమ్మెల్యే విజయరమణారావు ముఖచిత్రాన్ని గీసి అందజేశాడు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం

వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా రామిడి తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లుతో పాటు డైరెక్టర్లు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య పలువురు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియమించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుకు, సహకరించిన మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని మార్కెట్ పాలకవర్గంతో, రైతులతో కలిసి పనిచేసి మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, నాయకులు తుల మనోహర్‌రావు, ఓరుగంటి కొమురయ్య, దేవేందర్‌రావు, ఈద సత్యనారాయణరెడ్డి, మాదాసి సతీష్, అటికం శంకరయ్య, కొత్తూరు మొండయ్య, గాజుల మోహన్, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది ఆషాడపు రాజయ్య తదితరులు ఉన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రామిడి తిరుపతిరెడ్డి

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లిటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పింఛన్‌లు, గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ వైద్య సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నారని వివరించారు. 11 నెలలు గడిచిన ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయకుండా హమాలీ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా హమాలీ కూలీ రేట్లను వడ్లకు క్వింటాలుకు ప్రస్తుతం ఉన్న రేటుపై ఐదు రూపాయలు పెంచి 60 రూపాయలు తీసుకోవాలని, పత్తి ప్రస్తుతం ఉన్న రేటు పైన 100 రూపాయలు పెంచి రెండు వందల రూపాయలు క్వింటాలుకు తీసుకోవాలని నిర్ణయించారు. కూలి రేట్ల పెంపుదల అమలు కోసం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలని నిర్ణయించారు. సమావేశంలో హమాలీ యూనియన్ జిల్లా నాయకులు తిరుపతి, సదయ్య, కనకయ్య, ఎండీ రజవెల్లి, శంకరయ్య, నంబయ్య, వెంకటేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదు షురూ



క్రియాశీల సభ్యత్వ దరఖాస్తు అందజేస్తున్న నాయకులు

జ్యోతినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. క్రియాశీల సభ్యత్వ నమోదుకు సంబంధించి ఎన్నికల నిర్వహణ సహాయ అధికారిగా నియమితులైన క్యాతం వెంకటరమణ రామగుండం నియోజకవర్గం పరిధిలో క్రియాశీల సభ్య నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. 100 మంది సాధారణ సభ్యత్వం చేయించిన వారికి మాత్రమే క్రియాశీల సభ్యత్వం పొందే అవకాశం ఉందని వెంకటరమణ తెలిపారు. క్రియాశీల సభ్యత్వం కోసం ఎన్టీపీసీకి చెందిన బీజేపీ నాయకులు మిట్టపల్లి సతీష్, తోట కుమారస్వామి, సిలువేరి అంజి, చిరంజీవి, మంద శ్రీనివాస్, పల్లికొండ నర్సింగ్, గోసిక రమేష్ తదితరులు తమ దరఖాస్తులను వెంకటరమణకు అందజేశారు.



విక్రయానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్న జామ పంట

తక్కువ పెట్టుబడితో పండ్ల తోటలను సాగు చేసి లాభాలు గడిస్తున్నాడు తిరుపతిరెడ్డి అనే రైతు. అందరు రైతుల్లా కాకుండా కాస్త ప్రత్యేకంగా ఆలోచించి పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపాడు. సీజనల్ పండ్లు దొరకడంతో పాటు తాజాగా ఉండడంతో అమ్మకాలు కూడా బాగానే ఉంటున్నాయి. పండ్ల తోట కూడా రహదారికి పక్కనే ఉండడంతో వచ్చీపోయే వారు కొనుగోలు చేస్తుంటారు. చుట్టు పక్కల గ్రామాలే కాకుండా జిల్లా కేంద్రానికి కూడా పండ్ల వ్యాపారులు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

పండ్ల తోటలతో అధిక లాభాలు

- ఏటా రూ. 8 లక్షల మేర ఆర్జన
- తోట వద్దే అమ్మకాలు



జామ పంటను తెంపుతున్న రైతు తిరుపతిరెడ్డి

గొల్లపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన గుండేటి తిరుపతి రెడ్డి అనే రైతు పండ్ల తోటల సాగుతో లాభాలు గడిస్తున్నాడు. ఏడాది పొడవునా సీజనల్ పండ్లతో పాటు కూరగాయలు కూడా సాగు చేస్తూ ఏటా రూ. 8 లక్షల మేర ఆదాయాన్ని పొందుతున్నాడు. మార్కెట్లో ధర కంటే తక్కువకు అందించడంతో పాటు పండ్లు కూడా తాజాగా ఉండడంతో విని యోగదారులు ఇష్టపడి కొంటుంటారు.

- ఏటా రూ. 8 లక్షల ఆదాయం

మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారికిరువైపులా తిరుపతి రెడ్డికి చెందిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఏడాది పొడవునా జామ, బొప్పాయి, కర్భూజ, మామిడి వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నాడు. పండ్ల తోట రోడ్డు పక్కనే ఉండడంతో రోడ్డున వచ్చీ పోయే వారు ఆగి మరీ ఇష్టమైన పండ్లను కొనుగోలు చేస్తుంటారు. పండ్ల తోటల పెంపకం కోసం రూ. 2 నుంచి 3 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నాడు. అన్ని ఖర్చులు పోనూ ఏటా రూ. 8 లక్షల మేర లాభం వస్తుందని తిరుపతి రెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు సీజనల్ పండ్లు అందుబాటులో ఉంచడంతో డిమాండ్ కూడా బాగానే ఉంటుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో డిమాండ్‌కు పంట చేతికంది రావడంతో తోటల వద్దనే రిటేల్, హోల్ సెల్‌గా విక్రయిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పండ్ల వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులు సైతం పెద్ద మొత్తంలో పండ్లు కొనుగోలు చేస్తున్నారు. హోల్‌సేల్‌గా విక్రయాలు చేస్తుండడంతో లాభాలు కూడా ఆశించిన స్థాయిలో ఉంటున్నట్లు రైతు తెలిపాడు.



శ్రీరాముల పల్లెలో బొప్పాయి పంట సాగు

లాభదాయకంగా ఉంది
-తిరుపతి రెడ్డి, రైతు



సాంప్రదాయ పంటల సాగు కంటే పండ్ల తోటల పెంపకం వల్ల అధిక లాభాలు గడించవచ్చు. శ్రమ అధికంగా ఉంటుంది,అందుకు తగ్గట్లు లాభాలు సైతం ఉంటాయి. ఆరేళ్లుగా జామ, బొప్పాయి, మామిడి, కర్భూజ వంటి పండ్ల తోటలను పండిస్తున్నాను. కుటుంబ సభ్యుల సహకారంతోనే సాగు చేస్తున్నాను.

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర'

కరీంనగర్ టౌన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఓసీల్లోని ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ప్రస్తుతం అమలులో ఉన్న 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ఆరోపించారు. ఆదివారం కరీంనగర్‌లో ఓసీ జేఏసీ రాష్ట్ర, వివిధ జిల్లాల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లకు భంగం వాటిల్లితే చూస్తూ ఊర్కోబోమన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలో ఓసీ జేఏసీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ప్రతిఘటించి ప్రభుత్వాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలని దశాబ్దకాలం పోరాడి సాధించుకుంటే విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కల్పిస్తోందని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వే షన్లను రద్దు చేయకుండా అగ్రకులాల పేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి
- కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 3: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులను, గ్రంథాలయ గదిని పరిశీలించారు. అనంతరం బాక్సింగ్, జూడో, స్విమ్మింగ్ పూల్, సింథటిక్, అథ్లెటిక్ ట్రాక్, విద్యార్థుల హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులు ఆయా క్రీడల్లో తీసుకుంటున్న శిక్షణ గూర్చి కోచ్‌లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలా శిక్షణ పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒలంపిక్ స్థాయికి ఎదిగేలా లక్ష్యం పెట్టుకోవాలన్నారు. పారా ఒలింపిక్స్‌లో దీప్తి కనబరిచిన ప్రతిభను ఆయన విద్యార్థులకు వివరించారు. హాకీంపేట స్కూల్ తరహాలో అన్ని సౌకర్యాలు కల్పిస్తానని వాటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. సీఎం కప్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనను కనబరచాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు పవన్, సాయిరాం, శ్యాం, చందు, సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జాప శ్రావణ్‌రెడ్డి, కిమ్ ఫహద్, గట్టు ప్రశాంత్, ఆకుల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించడమే ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం తరపున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్తీక, శ్రావణ మాసాలకు ఎంతో విశిష్టత ఉన్నదని, రెండు మాసాలలో దేవాలయాల సందర్శనకు ప్రజలు ఎంతో ప్రాధాన్యం ఇస్తారని అన్నారు. కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు అవసరమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కార్తీక మాసంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే బడ్జెట్‌లో 50 కోట్ల రూపాయలను కేటాయించిందని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా రాజన్న ఆలయ ఆవరణలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఏఈఓలు గజ్వేల్లి రమేష్ బాబు, బి.శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతిరావు, ప్రోటోకాల్ పర్యవేక్షకులు జి.అశోక్ కుమార్, పీఆర్‌వో శివ సాయి ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనగామ గ్రామంలో జనగామ శ్రీనివాస్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతో పాటు మద్యానికి బానిసైన శ్రీనివాస్ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నించిన దుండగుడి పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలనీలోని అయ్యప్ప ఆలయంలో చోరీకి యత్నించిన దుండగుడిని ఆలయ అర్చకుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆదివారం ఆలయ ఆవరణలోని టేబుల్ మీద డబ్బుల బ్యాగ్‌ను ఉంచి అర్చకుడు దేవ్‌ప్రకాష్ పాండే పూజలు చేస్తుండగా ఆలయంలోకి అలుగువెల్లి రమేష్‌రెడ్డి అనే వ్యక్తి చొరబడ్డాడు. అనుమానించిన అర్చకుడు ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డికి సమాచారం అందించాడు. చాలాసేపు ఆలయ ఆవరణలో సంచరించిన రమేష్‌రెడ్డి నగదు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లగా, దేవ్ ప్రకాష్, చంద్రశేఖర్‌రెడ్డి వెంబడించి పట్టుకున్నారు. ఈక్రమంలో దుండగుడు చంద్రశేఖర్‌రెడ్డి బొటన వేలిని కొరికాడు. రమేష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అంధకారంలో రైల్వేస్టేషన్

- ఆధునికీకరణ పనులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరీంనగర్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనుల్లో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి అంధకారం నెలకొంటోంది. ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్ళాల్సిన ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లో కరెంటు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్లాట్ ఫారంపై ఒక్కటే ఫ్లడ్ లైట్ ఉండటంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతుండడంతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతోందని అధికారులు తెలిపారు. వెంటనే ప్రయాణికుల సౌకర్యార్థం కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో కరెంటు సరఫరా నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చీకట్లో రైలు, ప్రయాణికులు

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు కే.రవిచందర్, వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర స్టాఫ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాలుగవ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాంప మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందిన గంగ మ్మను రాష్ట్ర నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మధురమ్మ, నాయకులు హుస్సెన్, ఉస్మాన్, లక్ష్మణ్, నవీన్, మహేష్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- ఏడేళ్లుగా పట్టించుకోని అధికారులు
- పశువులకు నిలయంగా మారిన వైనం
- ఆందోళనలో లబ్ధిదారులు



సైదాపూర్ మండలం ఎలబోతారంలో పశువులకు నిలయంగా మారిన ఇళ్లు

సైదాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలానికి మంజూరైన 40 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేయక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తన దత్తత గ్రామమైన ఎలబోతారం గ్రామానికి 40 ఇళ్లను కేటాయించారు. ఊరు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టేందుకుఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ 2017 అక్టోబరు 23న శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఇందులో ఏడు ఇళ్ల పనులు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. మరో ఎనిమిది ఇళ్ల పనులు పిల్లర్సు వరకు పూర్తయ్యాయి. నాలుగు ఇళ్లు బేస్ మెంట్ వరకే చేశారు. మిగతా 21 ఇళ్ల పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలివేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అనంతరం అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయాన్ని పట్టించుకోక పోవడంతో పనులు ముందుకు సాగలేదు. అప్పటి ప్రభుత్వం పట్టించుకో లేదని, కాంగ్రెస్ సర్కారు అయినా పనులు పూర్తి చేసి అందజే యాలని గ్రా మస్థులు కోరుతున్నారు. కాగా తనకు ఉండ డానికి నివాసం లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన కర్ణకంటి రాజయ్య అనే వ్యక్తి తన కుటుంబంతో స్లాబ్ వేసిన ఇంటోనే చట్టూ పరుదలు కట్టుకొని నివాసం ఉం టున్నాడు. తమది నిరుపేద కుటుంబమని, కూలీ పని చేసుకొని జీవిస్తున్నామని వాపోతున్నాడు. ప్రభుత్వం స్పందించి ఇళ్లు పూర్తి చేసి అందించాలని కోరాడు.

పనులు పూర్తి చేయాలి..

గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు పూర్తి చేయాలి. ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎలబోతారం గ్రామంలో పర్యటించి పనులు నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు పూర్తి చేయాలి. లబ్ధిదారులకు త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- మ్యాకల శిరీష, మాజీ సర్పంచ్, ఎలబోతారం



ఎలబోతారంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

క్రైం కార్నర్

వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న టౌన్ సీఐ వేణుగోపాల్

జగిత్యాల క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వంద గ్రాముల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వంద గ్రాముల గంజాయిని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు టౌన్ సీఐ వేణుగోపాల్ ఆదివారం వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం బాలెపెల్లికి చెందిన జక్కుల మధు, పెగడపెల్లి మండలం వెంగళాయి పేటకు చెందిన రాచర్ల వంశీ, పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కల గూడూరు నలిమెల వినోద్ అనే ముగ్గురు వ్యక్తులు ఇతర ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి జగిత్యాలలో విక్రయించేందుకు స్కూటీపై బైపాస్ రోడ్ మీదుగా జగిత్యాలకు వస్తున్నారు. రాజీవ్ బైపాస్ చౌరస్తాలో టౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. దీంతో గంజాయి పట్టుబడింది. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వంశీపై గతంలో రెండు, వినోద్‌పై ఏడు గంజాయి కేసులు నమోదైనట్లు సీఐ వివరించారు. టౌన్ ఎస్సై మన్మథ రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



గణేశ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణనగర్‌కు చెందిన బొమ్మెన సాయి గణేశ్(17) అనే ఇంటర్ విద్యార్థి శనివారం నుంచి కనపడకుండా పోయాడని అతని తండ్రి తిరుపతి ఫిర్యాదు చేశాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంటి వద్ద చెప్పి బయటకు వెళ్లిన సాయి గణేష్ రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెదికినా ఆచూకీ లభించలేదని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



గాయపడిన మహర్షి

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో ఆదివారం వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో పలువురు చిన్నారులు గాయపడ్డారు. ఆరుబయట ఆడుకుంటున్న చేని మహర్షి, మామిండ్ల రుత్విక్, రాణా అనే చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఇష్టానుసారంగా కరవడంతో గాయపడ్డారు. స్థానికులు వారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఆదివారం ఐదుగురుపై పిచ్చికుక్క దాడిచేసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బండపల్లికి చెందిన నేదూరి రమేశ్, గడ్డం పుష్పవ్వ, గోపి ప్రకాశ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు వలస కూలీలపై పిచ్చికుక్క దాడి చేసింది. గాయపడినవారిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరిపై దాడి... కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని బోయవాడలో శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. బోయవాడకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ అయిన ఎర్రోజు రఘుకుమార్, నిశాని సంపత్‌లు ఇంటి నుంచి కమాన్ వైపు వెళ్తుండగా భారత్ థియేటర్ వద్ద అదే ప్రాంతానికి చెందిన సాత్విక్ అలియాస్ రిచ్చు, అతని సోదరుడు రేణు, వారి తండ్రి రాజేశంలు కలిసి కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని ఆదివారం ఉదయం పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా కథలాపూర్ మండలం నుంచి మెట్‌పల్లి పట్టణం మీదుగా నిజామాబాద్ వెళ్తున్న టీఎస్ 16యూఎ 0006 నెంబర్ గల ఇసుక లారీని ఉదయం పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌ను విచారిం చగా కథలాపూర్ నుంచి నిజామాబాద్ తీసుకెళ్లి అక్కడ అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. డ్రైవర్‌ను, యాజమానిని అదుపు లోకి తీసుకోని వారిపై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



కొమరమ్మ(ఫైల్)

ఓదెల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపులకు చెందిన వడ్లూరి కొమరమ్మ (60) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోత్కపల్లి ఏఎస్‌ఐ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమురమ్మ 16 సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేకపోవడంతో పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. గత నెల 30 వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటిలో పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలు కొమరమ్మ భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కిషన్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేష్(ఫైల్)

కమాన్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన నంది నరేష్(24) అనే యువకుడు పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంది నరేష్(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నరేష్ గ్రామ శివారులో పురుగుల మందు తాగినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరేష్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి

- మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ప్రభుత్వం ధాన్యం కొనడం లేదన్నారు. ధాన్యంతో కొనుగోలు కేంద్రాలన్నీ నిండిపోయాయన్నారు. స్థలం లేక రైతులు రోడ్లపై కుప్పలుపోసి పడిగాపులు కాస్తున్నారన్నారు. సన్న వడ్లకు బోనస్‌పైన పరిమితులు పెట్టాలనుకుంటున్నారన్నారు. ఎన్నికలకుముందు ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల సన్నవడ్లతోపాటు, దొడ్డు వడ్లకు బోనస్ ప్రకటించాల్సిందేనన్నారు. వరి కొనుగోలు జాప్యాన్ని నిరసిస్తూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి సోమవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికే 4,598 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమకు అందిన సమాచారం మేరకు ఒక్క కేంద్రంలోనూ కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ధాన్యం తడిసి పోయాయన్నారు. అకాలవర్షాల వల్ల చేతికొచ్చిన పంట నీళ్లపాలైందన్నారు. కరీం నగర్ పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి, సిరిసిల్ల, మానకొండూర్, హుజూరా బాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఎండబెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులు విసిగిపోయి మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకుంటునేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. తక్షణమే వరి ధాన్యం కొనునుగోళ్లను ప్రారంభించాలని, ఇచ్చిన హామీల మేరకు తాలు తరుగు, తేమతో సంబంధం లేకుండా ప్రతి గింజనూ కొనుగోలు చేయాలన్నారు. ఎన్నికల మెనిఫేస్టోలో పెట్టినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లించాలన్నారు. సన్న వడ్లకే బోనస్ చెల్లిస్తామని మెలిక పెట్టడం సమంజసం కాదన్నారు. ఎకరాకు 30 క్వింటాళ్ల మేర సన్న వడ్లు పండినప్పటికీ అందులో కొంత మేర మాత్రమే కొనుగోలు చేయాలని, సన్న వడ్లను నిర్ధారించడానికి అనేక కొలతలు ప్రామాణికంగా చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు పంపించినట్లు సమాచారం ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతూ సోమ వారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీ ల్దార్లకు వినతిపత్రాలు అందించాలని కోరారు.

ఆరు గంటల పాటు లైవ్ మ్యూజిక్ షో

- ఐదు రికార్డులు సొంతం చేసుకున్న సల్వాజి సంధ్య



సంధ్యకు ఐదు రికార్డులను అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్



పాడుతున్న సంధ్య

కరీంనగర్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన గాయని సల్వాజి సంధ్య ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆరు గంటల పాటు లైవ్ మ్యూజిక్ షో చేసి పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సినీ నేపథ్య గాయని కేఎస్ చిత్రపాడిన 72 పాటలను సంధ్య పాడింది. ఈ సందర్భంగా ఆమెకు భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డు, సింగర్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా ప్రతినిధి కేవీ రమణారావు అందజేశారు. ఆమె గానానికి తబలాపై ఆర్ అనిల్, ఎం. ప్రశాంత్, రిథమ్ ప్యాడ్‌పై ఎస్ మహేందర్, కె వినోద్, కీబోర్డుపై సతీశ్, సాయి, సత్యం, డ్రమ్స్‌పై మల్లేశ్ వాయిద్య సహకారం అందిం చినందుకు భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన సల్వాజీ మ్యూజిక్ గ్రూప్, ఈవెంట్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక చైర్మన్ సల్వాజి ప్రవీణ్‌కు భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ వరల్డ్ రికార్డ్‌లో నమోదు చేశారు. కళాకారులు డీఎల్ నామ్‌దేవ్, కృపాదానం, గొల్లపల్లి రవీందర్, మురళి మధుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పొన్నం రవిచంద్ర, కెఎస్ అనంతాచార్య, గోగుల ప్రసాద్, బాబు గౌరవేని పాల్గొన్నారు.

శిల్పకళా నైపుణ్యం



- శిలలకు ప్రాణం పోస్తున్న శిల్పులు
- 15 ఏళ్లుగా దేవతామూర్తుల రూపకల్పన
- ఇతర జిల్లాలకు సరఫరా

దేవుళ్ల విగ్రహాల తయారీలో హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు పట్టు సాధించారు. ఎటువంటి రాతి విగ్రహాలనైనా అందంగా మలుస్తూ వాటికి ప్రాణం పోస్తున్నారు. దీంతో వీరి ప్రతిభకు తగిన ప్రతిఫలం లభించడం ప్రారంభమైంది. ఇతర జిల్లాలకూ వీరు తయారు చేసిన విగ్రహాలను సరఫరా చేస్తున్నారు.

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రూపం లేని శిలలను తీసుకవచ్చి తమ శిల్ప కళ నైపుణ్యంతో సుందరంగా తీర్చిదిద్ది వాటికి రూపాన్ని ఇచ్చి జనం దైవంగా కొలిచేలా ప్రాణం పోస్తున్నారు. తమ కళా నైపుణ్యతో అందమైన దేవతా విగ్రహాలు తయారు చేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు హుజూరాబాద్‌కు బతుకుదెరువు కోసం 40ఏళ్ల క్రితం వచ్చారు. మొదట రోళ్లు తయారు చేసి జీవించేవారు. 15 ఏళ్ల క్రితం విగ్రహాలు తీయారు చేయడం ప్రారంభించారు. మరికొందరికి విగ్రహాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 10 మంది వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో పురాతనమైన కర్రలతో చేసిన విగ్రహాలు ఉండేవి. కాలక్రమంలో అవి దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్త విగ్రహాలను ప్రజలందరూ కలిసి ప్రతిష్ఠించుకుంటున్నారు. ప్రతి గ్రామంలో భూదేవి, నవగ్రహ విగ్రహాలు, పోచమ్మ, శ్రీసీతారామలక్ష్మణుడు, ఆంజనేయస్వామి, శివుడు, నంది, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటున్నారు. వీరందరూ హుజూరాబాద్‌కు వచ్చి తమకు అవసరమైన విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు.



● ఆంధ్రప్రదేశ్ నుంచి శిలలు..

చాలా ఏళ్ల క్రితం ఉన్న విగ్రహాల స్థానంలో కొత్త వాటిని ప్రతిష్ఠిస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఇదేవిధంగా విగ్రహాలను తీసుకెళ్తుండడంతో హుజూరాబాద్ శిల్పులకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిల్కలూరిపేట మండలం మాటూరు గ్రామం నుంచి శిల్పాలను తయారు చేసే శిలలను వీరు తీసుకువస్తారు. తర్వాత ఆర్డర్ల మేరకు అవసరమైన విధంగా కట్ చేసుకుంటారు. అనంతరం ఆ శిలలపై స్కెచ్‌లు వేసి విగ్రహాలను రూపొందిస్తారు. ఆదరణ బాగుండడంతో నాలుగేళ్లుగా సిబ్బందిని పెట్టుకొని విగ్రహాలు తయారు చేస్తున్నారు. హుజూరాబాద్‌లో పది దుకాణాల వరకు కరీంనగర్, హనుమకొండ రోడ్‌లో ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహాల కోసం కొంత మంది ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. విగ్రహాల ధర 10 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఉంటుంది. చుట్టుపక్కల జిల్లాల్లో చాలా గ్రామాల్లో హుజూరాబాద్ శిల్పులు తయారు చేసిన దేవతామూర్తులే కనిపిస్తుంటాయి.

మున్నూరు కాపులు ఐక్యతతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని, సమాజానికి దిక్సూచిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి జిల్లా బందంపల్లిలో ఆదివారం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మున్నూరు కాపులు మరింత బలోపేతం చెందాలని ఆకాంక్షించారు. ఇతర కులాలతో కలిసి నడిస్తే బీసీలకు రాజ్యాధికారంలో సరైన వాటా దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కులాల లెక్క తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఎన్యూమరేటర్లతో సర్వే చేపడుతున్నామని, 50 ప్రశ్నలతో 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ సర్వే చేస్తారని, సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కులగణన తర్వాత బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు దక్కే చాన్సు ఉందన్నారు. బీసీలకు కాంగ్రెస్ సర్కార్ మేలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఐక్యతతో కలిసి కొట్లాడి మున్నూరు కాపు హక్కులను పరిరక్షించుకుందా మన్నారు. రైతులే దేశానికి వెన్నుముక అని, కేసీఆర్ పాలనలో రైతులకు మేలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా కాపు కులస్థుల గెలుపునకు పార్టీలకతీతంగా పనిచేయాలని సూచించారు. కులగణన జరిగి తీరాల్సిందేనని, అప్పుడే కాపుల లెక్క బలం తేలి రాజ్యాధికారం వైపు అడుగులు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ రాజకీయంగా కాపులు ఎదగకుండా కొన్నివర్గాల వారు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాపులకు పిలుపునిచ్చారు. అగ్రవర్ణ దోపిడీ దారులే రాజకీయంగా ఎదుగుతున్నా కాపులను అణిచివేసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాపులు అప్రమత్తంగా ఉండాలని, అగ్రవర్ణ కుట్రలకు బలికావద్దని సూచించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధులను సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అనుమాల మహేష్, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, జిల్లా అధ్యక్షుడు తొగరి సురేష్, నాయకులు ఎడ్ల రవి, డాక్టర్ రాజ్‌కుమార్, అనిల్, కిషన్, బాలకృష్ణ, రాజేందర్, తోట కాంతయ్య, పూదరి కిషన్, దాసరి రాజేశం, కాపు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో కార్తీక సందడి



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక మాసం ప్రారంభం కావడం, ఆదివారం కావడంతో భక్తుల సంఖ్య అధిక సంఖ్యలో వచ్చారు. అధికారులు గర్భాలయంలో స్వామివారి అభిషేకం, అన్న పూజ నిలిపివేశారు. నందీశ్వరుని వెలుపలి వద్ద నుంచి దర్శనానికి అనుమతించారు. ఈవో వినోద్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు.

అంజన్న సన్నిధిలో సినీనటుడు

మల్యాల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కిరణ్ అబ్బవరం ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మరి కొంత మంది సినీ నటులతో కొండగట్టుకు వచ్చిన కిరణ్ స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్కరించారు. అభిమానులు కిరణ్‌తో సెల్ఫీలు తీసుకున్నారు.



ఈవోతో మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

సామ్రాజ్యవాద పాలకులను అడ్డుకోవాలి

- అదే అమరులకు నిజమైన నివాళి

- సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి జేవీ చలపతిరావు

జ్యోతినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద పాలకులను, కార్పొరేట్ సంస్థలకు దాసోహమైన ప్రభుత్వాలను నిలువరించినప్పుడే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, జాతీయ నేత జేవీ చలపతిరావు అన్నారు. ఆదివారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చలపతిరావు ప్రసంగిస్తూ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన అమరుల స్ఫూర్తిని వర్గపోరాటాలను నిర్మించాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ సాయుధ రైతంగా పోరాటంతో ఉత్తేజితమై దేశంలో రైతాంగ, శ్రీకాకుళ, నక్సల్బరీ, గోదావరి లోయ పోరాటాలు పురుడు పోసుకున్నాయని పేర్కొన్నారు భూస్వామ్య, దోపిడీ వ్యవస్థలను అంతమొందించకుండా ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూనే పాలక వర్గాల దోపిడీ, అణచివేత, అభివృద్ధి నిరోధక విధానాలపై వర్గ పోరాటాలు, సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా విడివిడిగా ఉద్యమాలు చేస్తున్న సీపీఐఎంఎల్, న్యూ డెమోక్రసి పార్టీలు త్వరలో ఏకమౌతాయని, ఐక్యతలో భాగంగానే అమరుల సంస్మరణ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత విముక్తి పోరాటాలలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. అరుణోదయ కళాకారులు సంస్మరణ గీతాలు ఆలపించారు. సభకు న్యూడెమక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్, అధ్యక్షుడు ఐ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ నరేష్, రామకృష్ణ, కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చిలుక శంకర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె జ్యోతి, అరుణోదయ నేత బతుకుల రాజన్న, రైతు సంఘం నేత చంద్రయ్య, నాయకులు మల్లేష్, లింగమూర్తి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ నేత జేవీ చలపతిరావు

చాక్‌పీస్‌లపై కళాకృతులు

• ప్రభుత్వ ఉపాధ్యాయుడి అద్భుత నైపుణ్యం

వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ ప్రవృత్తిగా చిత్ర కళను ఎంచుకున్నాడు. చాక్‌పీస్‌లను అందమైన ఆకృతులుగా మలుస్తూ ఔరా అనిపిస్తున్నాడు. సుద్దముక్కలపై అద్భుత కళాకృతులను ఆవిష్కరించి అవార్డులు సొంతం చేసుకుంటున్నాడు. మరోవైపు యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ అందిస్తున్నాడు చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కపిల్ల నరేశ్.



సుద్ద ముక్కపై చిత్రాలను చెక్కుతున్న నరేష్

చందుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కపిల్ల నరేశ్‌కు చిన్నతనం నుంచి కళలపై ఆసక్తి. ఈ క్రమంలో చాక్‌పీస్‌లపై కళాకృతులు రూపొందించడం ప్రారంభించాడు. అనేక అద్భుతాలు ఆవిష్కరించి రికార్డులు సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నరేష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. పిల్లలకు పాఠాలు చెబుతూనే చాకీపీస్‌లతో అద్భుత కళారూపాలను ఆవిష్కరిస్తున్నాడు. ఆర సెంటీమీటర్ వినాయకుడు, సెంటీమీటర్ నంది, విమానం తదితర నమూనాలను సుద్దముక్కలపై తీర్చిదిద్దాడు. ఖాళీ సీసాలు, సిరంజీలతోనూ వివిధ ఆకృతులను తయారు చేశాడు. ఇప్పటివరకు 50 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను చాక్ పీస్‌లపై రూపొందించాడు. రివర్స్ రైటింగ్‌లోనూ ప్రావీణ్యం సంపాదించాడు. మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి తనవంతుగా కృషి చేస్తున్నాడు. మ్యాజిక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గంట సమయంలోనే సుద్ద ముక్కపై జాతీయ గీతాన్ని రాశారు. భూతద్దంతో చూస్తేనే ఈ అక్షరాలు కనిపిస్తాయి. ఇగురం టీవీ అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కోచింగ్ ఇస్తున్నాడు. ఇప్పటికే వందలాది మంది నిరుద్యోగులు యూట్యూబ్ ఛానల్ ద్వారా కోచింగ్ తీసుకొని ఉద్యోగులు సాధించారు. ఈ క్రమంలో నరేష్‌ను అనేక అవార్డులు వరించాయి. బుక్ అఫ్ స్టేట్ రికార్డ్స్ తెలంగాణ, బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తదితర అనేక రికార్డులు సొంతమయ్యాయి.



రికార్డులతో ఉపాధ్యాయుడు నరేష్



సుద్దముక్కలపై చెక్కిన వివిధ చిత్రాలు

ధర్మపురిలో యమ ద్వితీయ వేడుకలు

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో యమ ద్వితీయ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. యమ ధర్మరాజు దేవాలయంలో ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, మహా సంకల్ప పూర్వకంగా అభిషేకం జరిపారు. అనంతరం హారతి, మంత్ర పుష్ప, తీర్థ, ప్రసాద వితరణలు జరిపారు. అధిక సంఖ్యలో శాశ్వత నిధి సభ్యులు, భక్తులు, గ్రామస్థులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



స్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

రెండో రోజు ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రెండో రోజు గోదావరి హారతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మం త్రోచ్ఛరణల మధ్య సాయంత్రం గోదావరి వరకు శోభాయాత్ర నిర్వహించారు. నది వద్ద ప్రత్యేక పూజలు చేసి గోదావరి నదికి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపారా యణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



గోదావరి నది వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

న్యూస్ బాక్స్

ఉపాధ్యాయుడికి సన్మానం

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికైన జిన్న సతీష్‌రెడ్డిని ఆదివారం శాలువాలతో పలువురు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు, మార్కెట్ డైరెక్టర్లు ఎనగంటి రవి, దాగేటి రామచంద్రం, మాజీ సర్పంచ్ మాదాసు సతీష్, మాజీ వార్డు మెంబర్ కలవల శ్యాం, బూర్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి ఆలయంలో భక్తుల సందడి

కమాన్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం భక్తులు స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. కార్తీకమాసం కావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వారి మొక్కులను చెల్లించుకున్నారు. మండలంలోని ఇతర దేవాలయాల్లో కూడా కార్తీకమాసంలో భక్తజనుల సందడి నెలకొంది.

ప్రభుత్వ విప్ అడ్లూరి పరామర్శ

ధర్మారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ధర్మారం మండలం కానంపల్లి గ్రామానికి చెందిన గుర్రం సురేష్ కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మన్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ చిత్ర పటానికి పూలవేసి అడ్లూరి నివాళులు అర్పించారు. అనంతరం సురేస్ కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసారు. లక్ష్మన్ కుమార్ వెంట ధర్మారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టవర్ ఎక్కిన యువకుడు

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తనకు ప్రాణహాని ఉందంటూ ఓ యువకుడు సుల్తానాబాద్ పట్టణంలోని సెల్ టవర్ ఎక్కాడు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన ఇంజాల రాకేష్ గ్రామంలో ఎలక్ట్రిషన్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు.

గ్రామంలోని కొందరితో తనకు ప్రాణభయం ఉందని సుల్తానాబాద్‌లో సెల్ టవర్ ఎక్కాడు. సీఐ సుబ్బారెడ్డి, సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో యువకుడు సెల్ టవర్ దిగి వచ్చాడు. దీంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్టీపీసీ పట్టించుకోదు.. మున్సిపాలిటీకి పట్టింపు లేదు..



గుంతల మయంగా తయారైన శాలపల్లి రోడ్డు



కల్వర్టు లేకుండా ఉన్న మల్యాపూర్ రోడ్డు

- అధ్వానంగా శాలపల్లి, మల్యాపూర్ రహదారులు

జ్యోతినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 4, 5వ డివిజన్లలోని ప్రధానమైన శాలపల్లి, మల్యాపూర్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పునరావాస కాలనీల బాగోగులు చూడాల్సిన ఎన్టీపీసీ యాజమాన్యం ప్రధానమైన రెండు రోడ్లను పట్టించుకోవడం లేదు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ ఈ రహదారుల విషయంలో పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. ప్రజాప్రతినిధుల చొరవ లేకపోవడంతో నగరం నడిబొడ్డున ఉన్న పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 4వ డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి నర్రశాలపల్లి వరకు ఉన్న రోడ్డు ప్రజలకు నరకాన్ని చూపిస్తోంది. దశాబ్ద కాలంగా కనీస మరమతులకు కూడా నోచుకోకపోవడంతో ప్రస్తుతం శాలపల్లి రోడ్డు అడుగడుగునా గుంతల మయంగా తయారైంది. రహదారిపై కృష్ణానగర్, శాలపల్లి, జంగాలపల్లి, మల్యాపూర్‌కు వెళ్లే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి పరిధిలో పలు ఫంక్షన్ హాళ్లు, విద్యాలయాలున్నాయి. నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు ఈ రోడ్డులో వెళ్తుంటాయి. పునరావాస కాలనీలకు వెళ్లే ఈరోడ్డును పునరుద్ధరించాల్సిన ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. శాలపల్లి రోడ్డు నిర్మాణానికి సీఎస్ఆర్ పథకం కింద గతంలో నిధులను ఎన్టీపీసీ కేటాయించింది. అయితే రెండేళ్లుగా మంజూరు చేసిన నిధులను కార్పొరేషన్‌కు విడుదల చేయడం లేదు. దీంతో కొత్త నిర్మించే రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్నట్లుగా తయారైంది. అలాగే మరో ప్రధానమైన టీవీఎస్ షోరూం, మల్యాపూర్ రహదారి పూర్తిగా గుంతలతో నిండిపోయింది. ఈ రోడ్డులోనే రామగుండం కమిషనరేట్, సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్‌తోపాటు శ్రీనగర్ కలనీ, మల్యాపూర్ ఉన్నాయి. నిత్యం పోలీసులు, సీఐఎస్ఎఫ్ జవానులు, ఆయా కాలనీలకు వెళ్లే ప్రజలు గుంతల మయంగా తయారైన రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. సీఐఎస్ఎఫ్ బ్యారక్స్ వరకు రహదారిని కొంత మేరకు పునరుద్ధరించినప్పటికీ మిగతా రోడ్డు, రెండు కల్వర్టులను నిర్మించాల్సి ఉన్నది.

రహదారి అధ్వానంగా ఉన్న కారణంగా ఇటీవల కాలంలో ఐదారు రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ రోడ్డును నిర్మించేందుకు సైతం ఎన్టీపీసీ రెండేళ్ల క్రితమే సీఎస్ ఆర్ కింద నిధులను కేటాయించింది. నిధులను కార్పొరేషన్‌కు విడుదల చేయడంలో ఎన్టీపీసీ తాత్సారం చేస్తున్నది. ఈ రెండు కీలకమైన రహదారుల నిర్మాణానికి సంబంధించి గతంలో బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీపీసీ నుంచి నిధులు విడుదల చేయించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. బాధ్యత ఉన్న ఎన్టీపీసీ నిర్లక్ష్యం చేయడం, ప్రజల కనీస సౌకర్యాలు కల్పించాల్సిన కార్పొరేషన్ అధికారులు అశ్రద్ధ ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా ఎన్టీపీసీ యాజమాన్యం ముందుకు వచ్చి రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తక్షణం రహదారులను నిర్మించాలి

- ఎండీ రహీం, కాంగ్రెస్ నాయకుడు



ఎన్టీపీసీ తక్షణం శాలపల్లి, మల్యాపూర్ రోడ్లను నిర్మించాలి. పునరావాస ప్రాంతాల అభివృద్ధిని చూడాల్సిన ఎన్టీపీసీ నిర్లక్ష్యం చేయడం సరికాదు. గతంలోనే రెండు రహదారులకు కేటాయించిన నిధులను మున్సిపాలిటీకి విడుదల చేయాలి. కార్పొరేషన్ పాలకవర్గం ముందుకు వచ్చి ఎన్టీపీసీపై ఒత్తిడి తెచ్చి రహదారులను పునరుద్ధరించాలి. మల్యాపూర్ రోడ్డును పూర్తిస్థాయి లో నిర్మించి అవసరమైన కల్వర్టులను నిర్మించాలి.

గడువు మూడు రోజులే..

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. వీళ్లే కాకుండా బీజేపీ నుంచి జాతీయ నాయకుడు పోల్సాని సుగుణాకర్‌రావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ రవీందర్ సింగ్, టీఎస్టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమల్ల రాకేష్, తదితరులు పోటీ చేస్తామని తమకు మద్దతు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నేతలను కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రస్తుత ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మానేరు విద్యాసంస్థల కరస్పాండెంట్ అనంతరెడ్డి, తదితరులు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము పోటీ చేయనున్నామని తమకు మద్దతునిచ్చి గెలిపించాలని వారు సైతం కోరుతూ వస్తున్నారు. అంతేగాకుండా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం అర్హులైన వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అలాగే కొంతమంది ఆయా జిల్లాల్లో నేరుగా కార్యాలయాలను ఓపెన్ చేసి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేస్తున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఎక్స్‌ను ఉపయోగించుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా లింకులు పంపుతున్నారు. వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఈనెల ఆరో తేదీ వరకు గడువు ఉండగా, ఆ తర్వాత సంబంధిత అధికారులు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు. గడువు మూడు రోజులే మిగిలి ఉండడంతో ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం ఓటు హక్కు నమోదు కోసం విస్తృతంగా ప్రచారం చేయాలని పోటీ చేసే అభ్యర్థులు కోరుతున్నారు.

రాజకీయాలకతీతంగా సేవకుడిగా పని చేస్తా

సుల్తానాబాద్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా సేవకుడిగా పనిచేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రైవేట్ లెక్చరర్స్‌తో పాటు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలను రూపుమాపుతానని ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తానని అన్నారు. పట్టభద్రుల అభ్యున్నతే ఎజెండాగా ముందుకు సాగుతానన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ లెక్చరర్స్ ఉద్యోగులు నరేందర్‌రెడ్డి కి మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎర్రం శెట్టి మునిందర్, తానిపర్తి తిరుపతిరావు, జిల్లా ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల కిరణ్, కాసర్ల మధుసూదన్ రెడ్డి, కందుల సునీల్, ముత్యం నరేష్, మద్దెల రామకృష్ణ, ఎంబడి దేవేందర్, అంజి, సంతోష్, తదితరులున్నారు.

● రానున్న ఎమ్మెల్సీ పట్టబద్దుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే జిల్లా గ్రంథాలయానికి శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పట్టబద్దుల అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంతటి అన్నయ్య గౌడ్‌ను నరేందర్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతకు బహుమతులు అందజేత



పెద్దపల్లిటౌన్, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొంతం శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మనసకోల్లాసంతో పాటు శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇక్కడే కాకుండా రాష్ట్రస్థాయి, దేశ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఇందు కోసం స్పోర్ట్స్ కోటాను పెంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భూతగడ్డ సంపత్, సయ్యద్ మస్రత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరిఖిల్లా అభివృద్ధికి బాటలు

రామగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట్ గ్రామ శివారులోని రామగిరిఖిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ఖిల్లా పర్యటక అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐదు కోట్ల రూపాయలను మంజూరు చేసింది. అందులో భాగంగా శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదివారం రామగిరి ఖిల్లాలో పర్యటించారు. రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పెద్దఎత్తున ఖిల్లాలో పర్యటించారు. తొలుత బేగంపేట్ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధానచౌరస్తాలో దివంగత నేత స్వర్గీయ శ్రీపాదరావు వాల్ పెయింటింగ్ వేసిన కొత్తూరు మోహన్‌ను శ్రీనుబాబు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణుల ఉన్నారు.





ఓసీపీ-3లో డీజిల్ బోజర్ల కొరత తీర్చాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో డీజిల్ బోజర్ల కొరతతో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతున్నదని, డీజిల్ బోజర్ల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మంద నరసింహారావు ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల ప్రణాళికా లోపంతో ఓసీపీ-3లోని భారీ యంత్రాలకు సకాలంలో డీజిల్ అందడం లేదని తెలిపారు. నాలుగు బోజర్లు నిత్యం నడుస్తున్నాయని, శనివారం మూడు బ్రేక్‌డౌన్ కావడంతో నాలుగు గంటల పాటు యంత్రాలు నిలిచిపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. యంత్రాలు పనిచేసే చోటుకి బోజర్లు రాలేని పరిస్థితి ఉండడంతో యంత్రాలే డీజిల్ నింపుకోవడానికి బోజర్ల వద్దకు వెళ్తుండడంతో గంట సమయం వృథా అవుతున్నట్టు తెలిపారు. ఒక్క షిఫ్టులో సుమారు 60 లీటర్ల వరకు డీజిల్ ఫిల్లింగ్ సమయంలో వృథాగా పోతున్నదని, కార్మికులకు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని నరసింహారావు పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్న సమస్యను ఓసీపీ-3 అధికారులు సీరియస్‌గా తీసుకుని ప్రాజెక్టు అవసరాల మేరకు కొత్త బోజర్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. యంత్రాల పని గంటలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచిస్తున్న అధికారులు తమ తప్పిదం కారణంగా యంత్రాలు ఖాళీగా ఉండాల్సి వస్తున్న విషయాన్ని సరిదిద్దుకోవాలని నరసింహారావు సూచించారు.

మందిరం పేరిట చందాలు రికవరీ చేయడం చట్టవిరుద్ధం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల వేతనాల నుంచి గుడి పేరిట సొమ్ము రికవరీ చేసి గుర్తింపు, ప్రాతినిథ్య సంఘాలకు చందాల రూపంలో చెల్లించడం మానుకోవాలని హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ ప్రకటనలో పేర్కొన్నారు. కార్మిక సంఘాల పేరిట రివకరీ చేసే అవకాశం ఉన్నా యాజమాన్యం గుడి చందా పేరిట ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలకు రికవరీ చేసిన సొమ్మును అందజేస్తున్నట్టు రియాజ్ ఆరోపించారు. అక్రమంగా గెలిచిన సంఘాలకు వేతనాల నుంచి సొమ్ము రికవరీ చేసి ఇవ్వడం చట్ట విరుద్ధమని, దీనిపై న్యాయ పరమైన చిక్కులను అధికారులు ఎదర్కోవాల్సి వస్తుందని తెలిపారు. గుడి, మజీద్‌ల పేరిట కార్మికుల వేతనాల నుంచి సొమ్ము రికవరీ చేయడం నిలిపివేయకుంటే హెచ్ఎంఎస్ కోర్టును ఆశ్రయిస్తుందని రియాజ్ అహ్మద్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్జీ-2 జీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 జీఎంగా బండి వెంకటయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం ఛాంబర్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఏరియా పరిధిలోని అధికారులు, సీఎంఓఏఐ ప్రతినిధులు జీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక కుటుంబాలకు తాగు నీటి కష్టాలు తీర్చాలి

రామగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ కార్మిక కుటుంబాలకు తాగు నీటి కష్టాలు తీర్చాలని పన్నూరు తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొంతకాలంగా కార్మికుల క్వార్టర్స్‌కు నీటి సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమంపై సింగరేణి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. సెంటినరీకాలనీలో వాటర్ హెడ్ ట్యాంకులకు నీటి సరఫరా చేసేందుకు బోర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కనీసం ట్యాంకుల ద్వారా నీటి సరఫ రా చేయాలని కోరారు. లేని పక్షంలో కార్మికుల కుటుంబాల పక్షనా నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

మ్యాట్రీ మోని పేరుతో మోసాలు... దంపతుల అరెస్టు

కోల్‌సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రీమోని పేరుతో పెళ్లి కావాల్సిన యువకులకు గాలం వేస్తూ లక్షల రూపాయల మోసాలకు పాల్పడుతున్న దంపతులను ముత్తారం మండలం హరిపురంలో ఈ నెల 2న అరెస్టు చేసినట్టు రామగుండం సైబర్ క్రైమ్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డీఎస్పీ ఎం వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు అశోక్‌కు చెందిన ఎర్ర వెంకట నాగరాజు(29), ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన రామంచ సౌజన్య(26)లు దంపతులు. సులువుగా డబ్బు సంపాదించాలని వక్రమార్గం ఎంచుకున్నారు. తెలుగు మ్యాట్రిమోనీ డాట్ కాం అనే వెబ్‌సైట్‌లో వీరి ఫోన్ నంబర్‌తో యువతుల పేరుతో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి అందమైన అమ్మాయిల ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ అబ్బాయిలకు రిక్వెస్ట్ పెట్టేవారు. ఎవరైనా స్పందిస్తే వారితో చాటింగ్ చేసేవారు. వారికి నమ్మకం కలిగించే వారు. అమ్మాయి తల్లికి ఆరోగ్య బాగాలేదంటూ, ఆసుపత్రిలో ఖర్చులకు డబ్బులు తక్కువ అయ్యాయంటూ డబ్బులువసూలు చేసేవారు. ఇలా అక్టోబరు 5న మంచిర్యాల జిల్లాకు చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.17లక్షలు వసూలు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ అధికారులు కేసు నమోదు చేసుకుని పరిశోధన చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఆయన తెలిపారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ వెంకటరమణ సూచించారు.

ముగిసిన సమగ్ర కుటుంబ సర్వే ఇళ్ల పరిశీలన

కమాన్‌పూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా నేటి ఆదివారంతో ఎన్యుమరేటర్ల ఇళ్ల గుర్తింపు ప్రక్రియ ముగిసింది. మండలంలో 78 మంది ఎన్యూమరేటర్లు, ఎనిమిది మంది పరిశీకులతో ఈ కార్యక్రమం పూర్తి చేశారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ఇళ్ల గుర్తింపు సేకరణలో భాగంగా ఇంటింటికి ఎన్యూమరేటర్లు స్టిక్కర్స్ అంటించారు. ఇక 6వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎన్యూమరేటర్లు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించనున్నారు. ఇళ్ల గుర్తింపు సర్వే ప్రక్రియ పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో లలిత, తహసీల్దార్ వాసంతి, ఎంపీవో భాస్కర్‌లతో పాటు తదితరులు ఉన్నారు.



సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల నుంచి సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన ఎలిగేడులో సర్వే చేస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈనెల ఆరో తేదీ నుంచి సర్వే ద్వారా కుటుంబ వివరాలను ప్రశ్నవళి ద్వారా సేకరించడం జరుగుతుందన్నారు. 49 మంది ఎన్యూమరేటర్లు నలుగురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేసి స్టిక్కర్స్ ఇంటింటికి అంటించామన్నారు. శనివారం 2587, ఆదివారం 4127 గృహాల సర్వే చేశామన్నరు. కార్యక్రమంలో కార్యదర్శులు అంజలి, పాపన్న, పున్నమయ్య, లలిత, శివకుమార్, హరిబాబు, శ్రవణ్, మహేష్, కుమార్, శిరీష, సురేష్, మసీయొద్దీన్, అంగన్‌వాడీలు, ఆశాలు, వీవో, కారోబాలు పాల్గొన్నారు.

సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ బీఈడీ కళాశాలలో ముక్తేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సత్కారాల కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మరో వృత్తిలో కొనసాగుతూ సాహితీరంగంలో తమదైన ముద్రను వేస్తున్న చాలా మంది సాహితీ వేత్తలు నవతరానికి ఆదర్శవంతమన్నారు. అనంతరం జవహర్‌లాల్ సంస్థల అధినేత, ముక్తేశ్వరి ఫౌండేషన్ చైర్మెన్ నరహరి శర్మతో పాటు పలువురు సాహితీ వేత్తలను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సాహితీవేత్త న్యాయమూర్తి మంగారి రాజేందర్(జింబో), సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, బహుబాషావేత్త నలిమెల భాస్కర్, కృష్ణారావు, సుబ్బారావు, ముని సురేష్ పిళ్లే తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాక మోహన్‌కు బాలసాహిత్య పురస్కారం

సిరిసిల్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మానేరు రచయితల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ మాచిరాజు బాలసాహిత్య పీఠం బాలసాహిత్య పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. బాలసాహితీ రంగంలో విశేష సేవ, రచనలు చేసిన వారికి ఈ పురష్కారం అందిస్తారు. 2024 సంవత్సరానికి డాక్టర్ పత్తిపాక మోహన్, చొక్కాపు వెంకటరమణను ఎంపిక చేశారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఆదివారం కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్, రచయిత్రి డాక్టర్ మృణాళిని ముఖ్య అతిథిగా హాజరై ఈ పురష్కారాలను ప్రదానం చేశారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కన్నెగంటి అనసూయ, ఆకాశవాణి విశాంత్ర సంచాలకుడు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, మాచిరాజు సాహిత్య పీఠం వ్యవస్థాపకుడు మాచిరాజు కామేశ్వర్ రావు పాల్గొన్నారు. డాక్టర్ పత్తిపాక మోహన్‌కు మారసం ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు.



పురస్కారాన్ని అందుకుంటున్న పత్తిపాక మోహన్

కార్తీక వన భోజనాలు

పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల సాంబ శివుడి ఆలయం వద్ద నంది గ్రూపు ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు ఆది వారం నిర్వహించారు. ధర్మపురి క్షేత్రానికి చెందిన నంది గ్రూపు ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు, గ్రూపు సభ్యులు సాంబశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి శాస్త్రోక్తంగా పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గ్రూపు సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని వన భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రూపు కన్వీనర్ దహెగాం గణేష్, గాదె శ్రీనివాస్, శ్యాంసుందర్, సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

నేడు కోటిలింగాలలో గోదావరి హారతి



గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

వెల్గటూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని గోదావరి వద్ద నేడు హారతి కార్యక్ర మం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కోటేశ్వ ర స్వామి కొలువు దీరిన కోటిలింగాలలో కార్తీక మాసంలో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రజలు డిమాండ్ చేసినప్పటికీ లాభం లేకపోయింది. ప్రస్తుతం ప్రజల కోరికను నెరవేరుస్తూ కోటిలింగాలలో గోదావరి హారతి నిర్వహించాలని ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడం పట్ల గ్రామస్తులతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలోనిత్య దీపో త్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.